04079601

పుణ్యకర్మల చేత పుడమి త్యాగము చేత
ప్రేమ భావములను పెంపు జేసి
దానవత్వము గాచి దైవభక్తిని పూని
నిత్య జీవితంబు నెఱపు నరుడ।

ప్రేమస్వరూపులారా

మానవ జన్మము అతి దుర్లభము. దుర్లభమైన మానవ జన్మలో పవిత్రమైన శాంతి పొందటం మహా దుర్లభము. కాని పుట్టినది మొదలు కొని గిట్టునంత వరకూ మానవుడు ఎన్నియో మార్పులు చెందుతున్నాడు. కాని ఎట్టి మార్పులు చెందుతున్నాడని విచారణ చేస్తే ఎట్టి మార్పులో మానవునికే తెలియదు. అతనికి తెలియని మార్పులు, అతనికి తెలియని కూర్పులు అతనికి తెలియని చేర్పులు జగత్తునందు జరుగుతున్నాయి.

బాల్యంబునందున పలువురితో గూడి
ఆటపాటలందు ఐక్యుడగును
యవ్వనంబలరిన అలరు విల్తుని పోల్చి
కామినీ లోలుడై క్రాలుచుండు
అర్ధ వయస్సున ఐహికంబున మునిగి
ద్రవ్యమార్జించుట దవిలయుండు
ముదిమి వచ్చిన యంత మురహరి తలవక
అదిఇది వేదని ఆలపించు
వివిధ దుర్వ్యసనంబులు వీడలేక
భక్తి మార్గంబు పైకను ఆసక్తి లేక
కర్మ పంకిలమున బడి క్రాలుచుండు
మట్టి కల్పను జన్మంబు మానవుండు

కానీ మానవుడు చాలా మేధావంతుడు. ఈ మేధాశక్తిని ఏ మార్గములో ఉపయోగించాలనేది అతనకు తెలియలేకపోతున్నాది. తెలిసి కూడా దానిని పెడమార్గము పట్టిస్తున్నాడు మానవుడు. ఈ విధమైన మార్గమునకు కారణమేమని ప్రశ్నించగా 'మాయ' అని చెబుతున్నాడు జవాబు.

'మాయ' కేవలము పేరుకు మాయగానీ మాయ అనే స్వరూపము లేదు. జగత్తంతయు ఆడించి ఆలించి పాలించి మరిపించి మైమరపించేది మాయ అని భ్రమిస్తున్నారు. దీనినే పండితులు మాయా నర్తకి అని పేరుపెడుతూ వచ్చారు. ప్రతి మానవుని మాయ నాట్యము చేయిస్తున్నాది. అయితే ఈ నర్తకి ఏ విధముగా వశము చేసుకోవాలి. న-ర్త-కి. కీర్తన చేత నర్తకి వశమైపోతుంది. దీనినే భక్తిమార్గమని ప్రబోధిస్తూ వచ్చారు. నీటిలో పూర్తి మునిగిన వ్యక్తి ఎట్టి మాటలు మాట్లాడ లేడు. పైపైన తేలేవాడు మాత్రమే మాటలు చెప్పగలడు. అదే విధముగా ప్రేమలో మునిగి ప్రేమ తత్త్వము అనుభవిస్తున్న వ్యక్తి, ఏ విధముగా ప్రేమ స్వరూపము గుర్తించి వర్ణించగలరు? కానీ ప్రేమ ప్రేమ అని చెబుతూ ప్రేమ పైపై తేలే వ్యక్తి మాత్రమే అనేక విధముల వర్ణిస్తుంటాడు. ఈ నాటి మానవుని పరిస్థితి ఇదే విధముగా ఉంటున్నది. ప్రేమను ఏ మాత్రము చూడక, ప్రేమను ఏ మాత్రము అనుభవించక ప్రేమ తత్త్వాన్ని ప్రబోధించటము హాస్యాస్పదముగా ఉంటుంది. ప్రేమ తత్త్వమునకు ఎట్టి సాధన మనం చేయాలి. అసలు సాధన అంటే ఏమిటి? సాధన అనగా అనాత్మను మరచి ఆత్మను చింతించటమే. అనిత్యమును మరచి నిత్యమును స్మరించటమే. అవిద్యను మరచి విద్యను తెలుసుకోటమే. సాధన అనగా ప్రత్యేకించి జప తప యజ్ఞ యాగాదులు చేయటం కాదు.

అనేకమంది స్త్రీలు తమ తమ కర్తవ్యములను తాము నిర్వర్తించుకుంటూ, తమ గృహములోని పనులు తాము చేసుకుంటూ తమ భర్తలను, బిడ్డలను పోషించుకుంటూ ఉంటారు. అయ్యో నేను సత్సంగములో ప్రవేశించలేకపోతినే అని బాధపడుతుంటారు. ప్రసంగములకు వెళ్ళలేకపోతినే అని విచారిస్తారు. సత్సంగములో ప్రవేశించినంత మాత్రమున, సమావేశములో చేరినంత మాత్రమున తాను చేసిన ఉపకారము ఏమిటి? ఇంటిలో పిల్లలను చూచుకొని ఇంటిని పరిశుద్ధము చేసుకొని భర్తను సరియైన మార్గములో ఆనందపరచి కుటుంబములో ఆరోగ్య జీవితమును గడపటమే సరైన సాధన. సాయంకాలమూ, తెల్లవారి పిల్లలకు భర్తకు అన్నం వండటము వారికి వడ్డించటము ఆఫీసుకు, స్కూలుకు పంపటము తదుపరి తన నిత్యకృత్యములు తాను నెరవేర్చుకోటం. ఇది కూడా ఒక సాధన. మొట్టమొదట అన్నం వండే సమయంలో గొప్ప సాధన సలుపుతున్నారు. బియ్యములోని రాళ్ళను వేరుచేసి

అన్నము వండువారు. రాళ్ళను వేరు చేయటము, బియ్యము వేరు చేయటము బియ్యము సంస్కరింప చేయటము క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగము. అనుభవించే బియ్యము క్షేత్రజ్ఞుడు. పారవేసే రాళ్ళు క్షేత్రము. తదుపరి కూరలు వండాలి. కూరగాయలు కత్తితో తరుగువారు. ఆ సమయంలో ఏ విధంగా భావించాలి. నేను కూరగాయలు కాదు తరగటము. నాయందున్న దుర్గుణములను తరుగుతున్నాను. జ్ఞానమనే కత్తితో తరుగుతున్నాను. ప్రేమ అనే జలములో వేస్తున్నాను. విజ్ఞానమనే మంటలో ఉడికిస్తున్నాను. శ్రద్ధ, భక్తి అనే ఉప్పు కారము వేస్తున్నాను. ఇది చక్కని రుచికరమైన వంట. ఇంక సాయంకాలము సమయములో పూరీలు చేసి అందిస్తుంది తల్లి పిల్లలకు. పూరీలు చేస్తున్న సమయములో నేను భజనకు పోకుండా అయ్యో నేను వంట ఇంట్లోనే నా కాలమంతా జరిగిపోతున్నదని బాధలు పడనక్కర లేదు. ఆ పూరీలు చేసే సమయంలో నా హృదయము విశాలము చేస్తున్నాను అనే పవిత్ర భావము స్మరించు. ఇల్లు ఊడుస్తూ ఉంటుంది. ఆ సమయంలో నేను ఇల్లు కాదు ఊడ్చేది. నా హృదయము పరిశుద్ధము చేస్తున్నాననే సంకల్పము ను వహించు. ఇలాంటి సత్సంకల్పములన్నీ సరైన సాధనలు. కేవలము పదిమందిలో పోయి కూర్చొని విన్నది విని తిరిగి ఆ స్థలము వదలి రావటం కంటె ఇంటిలో పవిత్రమైన మార్గములో సరైన సాధనల లోపల ఇంటిలోని వారిని పోషించుకోటం సరైన సాధన. కర్తవ్యము నిర్వర్తించటమే గొప్ప సాధన. ఇలాంటి పవిత్రమైన దారిలో నడచినప్పుడు ఇంతకంటె సాధన ఏముంటుంది.

సర్వసంగ పరిత్యాగుల వలె కనిపిస్తూ, కాషాయ వస్త్రములు ధరించి అహంకార మమకారములు విడువలేని వ్యక్తులు ఎంతమంది కనిపించటం లేదు. మండన మిశ్రుని భార్య ఉభయ భారతి. ఆమె మహాజ్ఞాని. ఆమె సర్వసంగ పరిత్యాగియై ఒక ఆశ్రమము నిర్మించుకొని అందులో స్త్రీలను చేర్చుకొని స్త్రీల ధర్మము నిత్యము ప్రబోధిస్తూ వచ్చేది. ఒకనాడు తన శిష్యులతో గంగానదికి స్నానమునకు వెళుతున్నది. ఒక చెట్టునీడ ఒక సన్యాసి నీరు త్రాగే కుండను తలక్రింద పెట్టుకొని పడుకున్నాడు. పక్కన పెడితే ఎత్తుకుపోతారని తలక్రింద పెట్టుకున్నాడు. ఉభయభారతి చూచింది. తన వెంటనున్న శిష్యులతో 'చూశారా! ఈ సన్యాసి సర్వసంగ పరిత్యాగి అయిపోయి కుండను విడువలేకపోతున్నారు. ఇతనికి కుండపై ఎంత అభిమానము ఉంటున్నాది. ఇంత అజ్ఞానముతో నున్నవారు సన్యాసి ఎట్లా అవుతాడు. తదుపరి ఆమె స్నానము చేసి వస్తున్నది. ఆ కుండను తీసి వస్తున్న దారిలో పారవేశాడు. అయ్యో కేవలం అభిమానము మాత్రమే అనుకున్నాను అహంకారము కూడా ఉంటున్నాది అనుకున్నది. నేను సర్వసంగ పరిత్యాగినని

కమండలము విసిరి వేయుటవలన అహంకారము పోయింది. మనిషి లోకాభిమానము కలిగినవాడు ఎన్ని సాధనలు చేసి ఏమి ఉపయోగము? అప్పుడు ఉభయభారతి సన్యాసికి చెప్పింది. 'అన్నీ వదలిన వానికి ఈ అభిమాన మమకారములు అహంకారము మంచిది కాదని' అనేక విధములుగా బోధించింది. అప్పుడు ఆ సన్యాసి ఆమె పాదములపైబడి ఈ అహంకార మమకారములను నేటినుండి వదలి సర్వసంగపరిత్యాగియై జీవిస్తానని మాట ఇచ్చాడు

ఈ విధముగా ప్రతి మానవుడు త్యాగము చేస్తున్నానని భావిస్తున్నాడు గాని ఏమిటి త్యాగము చేశాడు? త్యాగమంటే ఏమిటి?

ఆస్తులు విడి అడవికేగుట కాదు
భావమందు దుష్టభావము విడుటే
త్యాగమగును అదియె యోగమగును

అనేకమంది ప్రాకృతమైన చర్యలలో త్యాగము చేస్తున్నారు. ఇది కాదు త్యాగము. మనయందున్న దుర్గుణములు త్యాగము చేయాలి. దుర్భావములు త్యాగము చేయాలి. దురహంకారము త్యాగము చేయాలి. దురభ్యాసములు త్యాగము చేయాలి. ఇది నిజమైన త్యాగము. ఇల్లువాకిలి వదలి వెళ్ళిపోవటము చాలా సులభమే. ఇది గొప్ప కష్టమైనది కాదు. కాని మనలను బాధించి అనేక విధముల పెడమార్గమును చూపే దుర్గుణములు మనం త్యాగము చేయాలి. లోకములో నవగ్రహములంటారు. నవగ్రహములు కాదు మనలను బాధించేవి. రెండే రెండు గ్రహములు. రాగద్వేషములనే రెండు గ్రహములు. ఈ రాగద్వేషములనే గ్రహములు మానవుని అనేక విధములుగా పట్టి పీడిస్తున్నాయి. ఈ రెండింటిని వదులుతే శాంతి మనవశమై పోతుంది. శాంతికి వేరే ప్రత్యేక సాధనలు చేయనక్కరలేదు. మనము చేయవలసిన కర్తవ్యకర్మలు నిర్వర్తించాలి. నీవు గృహస్థుడుగా ఉంటున్నావు. నీ గృహస్థ ధర్మము నిర్వర్తించుకో. మీరు బ్రహ్మచారులుగా ఉంటున్నారు, ఈ బ్రహ్మచర్య తత్త్వమును మీరు నిర్వర్తించుకోండి. ఈ విధముగా ఎవరెవరి ఆశ్రమ ధర్మాన్ని వారు పాటించుకుంటూ పవిత్రమైన భగవచ్చింతన చేసుకుంటూ కాలమును ఎంతైనా సార్థకము గావించుకోవచ్చు.

కాని ఈనాటి లోకము యొక్క పరిస్థితి మరింత చిత్రముగా ఉంటున్నది. మంచి విషయములు, పవిత్రమైన విషయములు, ఆదర్శవంతమైన విషయములు చెప్పినప్పుడు వారికి అవి చెవికి సోకవు. చెడ్డమాట ఎవరైనా మాట్లాడుతుంటే రెండు చెవులు చాలవు. ఇంకా అందరి చెవులూ

వేసుకొని వినటానికి ప్రయత్నిస్తాడు.

మంచి మాట వినరు మనసిచ్చి చెప్పినా
చెడ్డమాట ముందు చెవిని బడును
ఇట్టి వారు నన్ను ఎరుగంగ నేర్తురా
ఎంత చదువులున్న ఏమి ఫలము.?

ఈనాటి మానవుని పరిస్థితి ఈ విధమైన చర్యలలో నడుస్తోంది. మంచిని చూడాలంటే వారికే మాత్రము ఇష్టముండదు. అంతా చెడ్డనే చూడాలి. మంచిని వినాలంటే మనసే రాదు. చెడ్డ వినాలంటే మనసంతా అక్కడే ఉంటుంది. ఇంక మంచి విషయాలు తలంచాలంటే తలపునకే రావు. అసలు చెడ్డవి పిలవనక్కరలేదు. అవే వచ్చి చేరుతుంటాయి. కారణమేమిటి? మన జీవితము యొక్క అభ్యాసము ఆ విధంగా గావించుకుంటూ వచ్చాము. అభ్యాసము మంచిదిగా ఉండాలి. ఉన్నది ఒకటే. కాని అనేకత్వాన్ని అది చేర్చుకుంటుంది. ఇది చూడండి ఒక పూలమాల. ఇందులో పూలు అనేకంగా ఉన్నప్పటికి దారం ఒకటిగానే ఉంటుంది. ఇది నిన్న దారమే. నేడు దారమే. రేపు దారమే. ఈ పూలు నిన్న మొగ్గ ఈ రోజు విచ్చటం. రేపు వాడిపోటం. పువ్వులనేవి మన దేహములే. నేడు యవ్వనం పూవు వంటిది. తదుపరి నీవు వృద్ధుడవు. వాడిపోతావు. ఈ విధంగా దేహములు మారుతూ వస్తాయి కాని ఈ దేహమందున్న సూత్రము ఎప్పటికి మారదు. త్రికాలములందు ఏకత్వంగా ఉంటుంది. దీనినే బ్రహ్మసూత్రము అన్నారు. అందరియందు బ్రహ్మతత్త్వమే ఉంది. అది ఎప్పటికి మార్పు చెందేది కాదు. కాని ఈ సూత్రములో చేర్చబడిన జీవులనే పుష్పములు మార్పు చెందుతూ ఉంటాయి. కనుక మార్పు చెందే జీవితానికి మనం ఏమాత్రము విచారించనక్కరలేదు. మార్పు చెందని దానిని మనము ప్రయత్నపూర్వకముగా సాధించాలి. ఇదే మనం చేయవలసిన సాధన.

మనకిచ్చిన బుద్ధిని మనస్సును సరైన స్థితిలో ప్రవేశపెట్టాలి. ఈ టంబ్లరులో నీరుంది. ఈ నీటి అడుగున చక్కెర ఉంది. కాని పైన నీరు మనం త్రాగినప్పుడు ఏ విధమైన రుచి లభించదు. ఇందులో ఒక స్పూను వేసి చక్కగా కలిపినప్పుడు అడుగున ఉన్న చక్కెర అన్ని భాగములలో ప్రవేశించి నీరంతా తీయగా మారిపోతుంది. అదే విధముగా మన హృదయమనే పాత్రలో అడుగుభాగమున దైవత్వమనే చక్కెర ఉంటుంది. పై భాగమంతా ప్రాకృతమైన విషయాలతో నిండి ఉంటుంది. ప్రాకృతమైన విషయములే నీరు. ఈ నీటిలో ఎట్టి రుచి లేదు కాని బుద్ధి అనే

సూపును దానిలో వేసి, భగవచ్చింతన అనే దానిని కలిపినప్పుడు అడుగున ఉన్న దివ్యత్వమనే చక్కెర సర్వత్రా వ్యాపించి పోతుంది. ఇదే సాధన. ఈ సాధనకు మనము ఎక్కడో బయటకు పోనక్కర లేదు. పాత్ర మనయందే ఉంటున్నది. దివ్యత్వమనే చక్కెర మనయందే ఉంటున్నది. బుద్ధి అనే చెంచా మనదగ్గరే ఉంటున్నది. ఎందుకు వెతకాలి? ఎక్కడకు మనం పోవాలి? ఎక్కడ మనం అన్వేషణ జరపాలి. ఇదంతా కేవలము ఒకవిధమైన అమాయకత్వము.

త్యాగరాజు శ్రీరామచంద్రుని వెతుక్కుంటూ వెళ్ళాడు. తంజావూరు రాజు అతనిని ఆహ్వానము చేసి సమావేశము జరిపించి చక్కగా పాటలు పాడించాడు. త్యాగరాజు సభను చూచాడు

'ఎందరో మహానుభావులు అందరికీ వందనములు'

ఎందరో మహానుభావులుంటున్నారు అందరికీ నావందనములని ప్రారంభించాడు. ఈ విధంగా సమావేశమున తన్మయత్వములో ముంచివేశాడు. అతనికి డబ్బు ఇవ్వటానికి వెళ్ళాడు తంజావూరు రాజు. చూచాడు దాన్ని. 'నిధి చాలా సుఖమా ఈశ్వరసన్నిధి చాలా సుఖమా। నిజముగ తెలుపవె మనసా' అని ప్రశ్న వేసుకున్నాడు. నాకు అక్కర లేదన్నాడు. ఒక పల్లకి ఇచ్చి ఊరికి పంపుతున్నాడు తంజావూరు రాజు. గొప్పరాజ పల్లకిలో నున్న త్యాగరాజును చూచారు దొంగలు. ఇతని దగ్గర డబ్బు ఉంటుందని తరుముకుంటూ వచ్చారు. పల్లకి మోసే వారు చెప్పారు 'దొంగలంతా వెంటాడుతున్నారు మనలను చంపి వేస్తారేమో' అన్నారు. 'మనకెందుకురా భయము. మనదగ్గర భయపడే ధనము ఏ మాత్రము లేదు. ధనమున్న వానికే భయము. గుణమున్న వానికి భయమేమిటి? మనలో గుణమే గాని ధనము లేదు. భయపడకండి' అన్నాడు. కొంతసేపటికి పరుగెడుతున్న దొంగలు త్యాగరాజు పాదములపై పడ్డారు రక్షించమని ప్రార్థించారు. 'ఎవరినుంచి రక్షించాలి? ఎందుకోసం రక్షించాలి? మీకేం ఆపద కల్గింది?' ప్రశ్నించాడు త్యాగరాజు. 'ఎవరో ఇద్దరు అంబులను పట్టుకొని మమ్ములను తరుముకుంటూ వస్తున్నారు' అన్నారు. రాముడు ఎక్కడో పోయినాడని వెతుకుతూ పోయిన త్యాగరాజు ఈ దొంగలు వచ్చి చెప్పిన లక్షణమే అనుకున్నాడు 'ముందు వెనక ఇరుప్రక్కల తోడై ఉన్నావా ఓ రామా।' రాము నా వెంటనే ఉండినప్పటికీ నేను ఎక్కడెక్కడో వెతుకుతూ పోయాను. ఆ దొంగలు చెప్పటం వలన తాను గుర్తించాడు తనయందే ఉన్నాడని. ఇలాంటి మహనీయులను తన వెంటనే ఉండి రక్షిస్తాడు భగవంతుడు.

రామ నన్ను బ్రోవరా, రామ నన్ను బ్రోవరా
లోకాభిరామ నన్ను బ్రోవరా రామ నన్ను బ్రోవరా।

ఓ రామా నన్నుకాపాడు అని కూడ మరచి పోయాడు. అనగా తనయందే ఉన్నాడనే సత్యము గుర్తించుకునేంతవరకు బయటప్రపంచములో వెతుకుతూ ఉంటాడు సాధకుడు. నా జంటనే ఇంటనే వెంటనే ఉంటున్నాడనే సత్యము గుర్తించుకున్న తరువాత ఇంక ఎట్టి సాధనలు చేయనక్కర లేదు. అలాంటి తత్వము ప్రతి వ్యక్తి చక్కగా అర్థము చేసుకోవాలి.

నీవే దైవముగా ఉంటున్నావు. నీ హృదయములో నే దైవము ఉంటున్నాడు. దైవము యొక్క స్థానము నీ హృదయమే. దేహమే దేవాలయము. అందులోనే దైవత్వము ఉంటున్నది. దైవత్వము మన యందే ఉంటున్నది. ఈ సత్యము ప్రతి ఒక్కరు కనుక్కోవాలి.

పరుల దూషణ చేయ పాపఫలం బబ్బు
విడువ వెన్నటికి విశ్వమందు
పరులు పరులు కాదు పరమాత్ముడే యగు.

పరులు పరులు కాదు పరమాత్ముడే. ఎవరిని మనం దూషించ కూడదు. ఎవరిని మనం విమర్శించ కూడదు. ఎవరిని మనము అవమాన పరచకూడదు. కారణం ఏమిటి? అందరియందుండిన పరమాత్ముడొక్కడే. ఇట్టి దివ్యత్వము మనము తెలుసుకొన్న తరువాత ఎందుకు మనము ఈ విచారమునకు చోటు ఇవ్వాలి. కనుక మనము ఏ వ్యక్తిని చూసినా ప్రేమించి వారికి తగిన గౌరవముతో పంపాలి. ఒక చిన్న ఉదాహరణము.

ఇప్పుడు జ్ఞాపకము చేయకూడదు కానీ స్వామి ఇచ్చిన మాటను చిన్నపిల్లవాడైనా ఈనాటి వరకు ఆమాటను రక్షించుకుంటూ వస్తున్నాడు. మొట్టమొదట మాట్లాడిన పిల్లవాడు సిమ్లా పిల్లవాడు. పది సంవత్సరముల పూర్వము చాలా చిన్నవాడు. ప్రైమరీ స్కూలులో చదువుతున్నాడు. ఆ అబ్బాయి ఈ అబ్బాయి అన్నదమ్ములు. హిమాచల్ ప్రదేశ్ నుండి తల్లిని స్ట్రెచ్చర్ లో బృందావనమునకు తీసుకు వచ్చారు. ఆ పిల్లవానిని ఈ పిల్లవానిని దగ్గర తీసుకున్నాను. తల్లితో చెప్పాను. వీరు నా పిల్లలు. నీవు ఏమాత్రం విచారించ వద్దు. నీవు ఈ పిల్లల చింతనే పెట్టుకో వద్దు!' అన్నాను. తల్లి కూడా స్వామికి మాట ఇచ్చింది. నా పిల్లలను 'సాయిమాతా' నీకు అప్పచెబుతున్నాను అని అప్పచెప్పి కన్నులు మూసింది. బృందావనం నుంచి నేను ఈ పిల్లలను తీసుకు వచ్చాను. అప్పుడు చాలా చిన్న పిల్లలు. పిల్లవాడు చెప్పాడు. నా తల్లి సాయి ఈ తల్లే ముఖ్యమైన తల్లి అన్నాడు. తండ్రి కూడా అదే విధముగా ప్రామిస్ చేశాడు. అప్పటి నుంచి ఈ ప్రశాంతి నిలయ

ములో ఇరువురు కంటి ధార పెట్టలేదు. ఆ లేత హృదయులైన వారు ఆ ప్రోమిస్ యొక్క ప్రమాణము అంత గట్టిగా కలిపెట్టుకున్నారు. ప్రమాణము ఇచ్చిన తరువాత జీవితములో దుఃఖమనేదే ఉండదు. అదే శరణాగతి. తల్లి పోయింది. తండ్రి కూడా ఎక్కువ రావటం లేదు. స్వామి చూసుకుంటున్నాడని వదలిపెట్టారు. ఉదయము సాయంత్రము వారిని చూచి యోగక్షేమాలు విచారిస్తున్నాను. అట్టి లేత హృదయులైన పిల్లలలో అంత పరిపూర్ణమైన విశ్వాసము. ఈనాడు ఆ పిల్లవాడు విశ్వాసముపై చక్కగా బోధించాడు. ఆ విశ్వాసము తనయందు నిండి ఉంటున్నాది. తల్లి లేని బాధ వీడు వారు అనుభవించలేదు. ఒకనాడు తల్లి జ్ఞాపకం వచ్చిందని వార్డెను నా దగ్గరకు తీసుకువచ్చాది. ఆ పిల్లవానిని. స్వామి! భోజనం చేయటం లేదు ఏడుస్తున్నాడని. అప్పుడు ఐదు సంవత్సరముల పిల్లవాడు. 1st standard. ఇక్కడికి పిల్చుకొని చక్కగా ఆనందపెట్టి ఇంటర్వ్యూ రూములోకి తీసుకుపోయి ఉంగరం పెట్టి అది చేసి ఇది చేసి మరపించి మురిపింప చేశాను. అప్పటినుంచి వాడు ఎప్పుడు చూచినా నవ్వుతునే. పిల్లల హృదయాలు అంత పవిత్రంగా ఉంటాయి. పెద్దలైనవారు అటువంటి ప్రేమను గుర్తించుకోలేక పోతున్నారు. ప్రేమ విషయము ఇంత పవిత్రముగా ఉంటుంది. ఇంత ధైర్య సాహసముల నందిస్తుంది. వేరొక ప్రదేశములో ఈ పిల్లలు ఉండగలిగే వారా! స్వామి దగ్గర కాబట్టి వారు ఉండగలిగారు. వేయి తల్లుల ప్రేమతో చూస్తుంటాడు స్వామి. ఈ సత్యమును గొప్ప వ్యాసులు కూడా గుర్తించుకోలేరు. ధ్యానము చేస్తారు. జపములు చేస్తారు ఏమి ప్రయోజనం? అభిమాన మమకారముల చేత క్రుంగి పోతుంటారు.

ప్రపంచములో ఒక్క మాటను తీసుకొని నిశ్చింతగా జీవించండి. ఏమిటి ఆ మాట? ప్రేమ ఒక్కటే. ప్రేమ ఒక్కదానిని మనం పెంచుకున్నామంటే అన్ని బలములు మనకు లభిస్తాయి. భుజబలము బుద్ధిబలము దేహబలము అన్ని బలములు మనకు ఆవిర్భవిస్తాయి. లోకములో మనకు ఏ శక్తి కావాలో అన్ని శక్తులు దానిలోనే ఉంటాయి. బంగారు మన చేతిలో ఉంటే రకవారి నగలు చేయించుకోవచ్చు. దైవానుగ్రహమునకు పాత్రులైన వారు దేనినైనా సాధించగలరు. దైవాన్ని సాధించినవారికి ఏది కావాలి దానికంటె ఎక్కువ. కాన దైవము యొక్క తత్త్వమును చక్కగా గుర్తించి వర్తించాలి. ప్రపంచములో ఏ సాధనలు చేయనక్కర లేదు. మనలో ఉన్న దుర్గుణములు దూరం చేసుకుంటే చాలు. అందరియందు నేను ఆశించిన దైవము ఉన్నాడనే విశ్వాసము పెంచుకోవాలి. అటువంటి ఏకాత్మ భావము విద్యార్థులు పెంచుకోవాలి. ఈ ఏకాత్మ తత్త్వమును మనం పెంచుకున్నప్పుడు దేనినైనా మనము సాధించ

వచ్చు. ధనకనక వస్తు వాహనాదులు వచ్చిపోయేవి మాత్రమే. అయితే అవికూడా లోకమునకు ఉండవలసినవే.

ఏ చిన్న విషయమునుండి పెద్ద విషయము వరకు నేను స్వయంగా చూచుకుంటూ ఉంటాను. మీరు తెలుసుకోలేరు. ఏదో పలకరించలేదే అని అనుకుంటూ ఉంటారు. ఏ చిన్న విషయమైనా వార్డెనును పిలచి నేను అడుగుతుంటాను. ఇన్ని రకములైన బాధ్యతలుండినా ప్రతి పిల్లవానిని గురించి విచారిస్తుంటాను. కానీ ఈ విశాలహృదయము లేని పిల్లలు నావైపు చూడలేదే అనుకుంటారు. నేను అందరిని చూస్తున్నాను. ఇప్పుడు మాట్లాడిన పిల్లవాడు 'ఒక తల్లి పోయింది వేయి తల్లుల ప్రేమ చిక్కింది' అన్నాడు. ఈ విధంగా ధైర్యముతో ఎవరు చెప్పగలరు? అందువలనే ప్రారంభించే సమయంలో my mothers sai అన్నాడు. అలాంటి విశ్వాసమే వారిని సంరక్షించి అన్నివిధముల జయము చేకూరుస్తుంది. ప్రేమ తత్వము విజయాన్ని ఆకర్షిస్తుంది. కనుక ఒక్క ప్రేమ తత్వాన్ని పెంచుకోండి. ఈ ప్రేమ తత్వము పెంచుకుంటే సర్వవిధముల జయము సాధించగలరు.

మరొకటి. ఈ క్రమశిక్షణ మీరు పాటించాలి. నిన్నటి దినము మీకు చెప్పాను. ప్రేమతో పలకరించండి. ప్రేమతో సంభాషించండి. కఠినమైన మాటలు ఉపయోగపెట్టకండి అని చెప్పాను. కొన్ని నెలలనుంచి ప్రశాంతి నిలయములో డిసిప్లిన్ తగ్గిపోయింది. భజన జరిగిన క్షణమే లేచేవారి అల్లరి ఘోరంగా ఉంటున్నది. నేను select చేసి కోరికల రూమునకు పోయినప్పుడు వరండాలోని వారు, బయటి వారు మార్కెట్టులో లేచినట్లుగా లేచి ఒకే అల్లరిగా ఉంటున్నది. సమావేశము జరిగిన తరువాత సమావేశములో స్వామి చెప్పిన విషయములను మననము చేసుకుంటూ పోవాలి గానీ మాటలు చెప్పుకుంటూ కాదు పోవటం. ఇటువైపు ఆడవారు, అటువైపు మగవారు ఒక గోలగా పోతుంటారు. ఒకే శబ్దము మాటలు, మాటలు. కేవలము ఈ ఆవరణమునందే కాదు, ప్రశాంతినిలయమందే కాదు ఏ ఒక్క రోడ్డు కాదు ఎక్కడా అధికంగా మాట్లాడకండి. discipline మన shadow వంటిది. నేను ఎక్కడకు వెళ్ళినా నా shadow మాదిరి నా వెంటనే రావాలి నా discipline. ఈ ఆవరణమునందే కాక బయట రోడ్డు పైకూడా పాటించాలి. భగవంతుడు ముఖ్యంగా ఆశించేది discipline. ఈ సమావేశము ముగిసిన తరువాత వెళ్ళే సమయములో నిశ్శబ్దంగా ఉంటుండాలి. భజన తరువాత నిశ్శబ్దముగా మీరు వెళ్ళాలి. ఇంటికి వెళ్ళిన తరువాత ఇంట్లో విషయములు మాట్లాడుకోవచ్చు. ఏ ప్రదేశమునందు గాని ప్రశాంతి నిలయమందే కాదు, బయట ప్రదేశములో కూడా మాటలతో పని లేదు. మాటల చేత దివ్య

04-07-1960.

శక్తిని మనం పాడు చేసుకుంటున్నాము. విన్నదంతా హృదయములో చెదిరిపోతుంది. విన్నది మరచిపోతాం. మగవారు ఆడవారు ఒకరికొకరు ఏమాత్రము మాట్లాడించ కూడదు. మాట్లాడవలసిన అవసరముంటే ఇంటిదగ్గర మాట్లాడు. బజారునందుగానీ, ఆవరణయందుగాని ఒకరికొకరు మాట్లాడ కూడదు. అంతేకాదు. కొందరు పెద్దలు విద్యార్థులయెదురుగా కూర్చుని మాట్లాడుతుంటారు. ఇది bad ideal. పిల్లలముందుగా ఆదర్శవంతముగా ఉండాలి. అవిధమైన నిశ్శబ్దము మనము కాపాడుకొన్నప్పుడు నిశ్శబ్దములోని శబ్దమే బ్రహ్మ. నేటినుండి ఈ discipline కొంతవరకు పోషించుకుంటూరండి. కఠినమైన మాటలు ప్రవేశపెట్టకండి. నిన్ననే చెప్పాను. అందరు ప్రేమమయంగా ఉండాలి. ఆ ప్రేమయే మన ప్రాణముగా భావించుకోవాలి. ఈ ప్రేమయే దైవంగా విశ్వసించాలి. ఆ ప్రేమను పూర్ణము చేస్తే దైవమును పూర్ణము చేసినట్లవుతుంది. ప్రేమతో మాట్లాడి దయా సాహసముల చేత మన జీవితము గడుపుకుంటూ దైవత్వము చింతించుకుంటూ కాలమునే మనము మరచిపోయే స్థితికి రావాలి.